మనవడిపై తాత హత్యాయత్నం

కుటుంబ కలహాలే కారణం

ధర్మారం,మార్చి30: కుటుంబ కలహాల కారణంగా మనవడిపై తాత హత్యాయత్నం చేసిన సంఘటన నంది మేడారం గ్రామంలో శనివారం తెల్లవారు జామునా జరిగింది. ఈ ఘటనలో గాయపడిన యువకుడు వరంగల్ ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. ఎస్ఐ టీ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నంది మేడారం గ్రామానికి చెందిన సామంతుల మహేశ్ (28)కు వివాహమైంది. భార్యతో కలిసి మహేశ్ తాత కొమురయ్య (66) ఇంట్లోనే ఉంటున్నారు. మహేశ్ మద్యం మత్తులో నిత్యం తాత,నానమ్మను దూషించడంతో పాటు కొడుతూ ఉండేవాడు. దీంతో కొమురయ్య మనవడిపై కోపం పెంచుకున్నాడు. మహేశ్ ఇంటి ముందు ఆరుబయట మంచంలో నిద్రిస్తుండగా అదను చూసిన కొమురయ్య పదుపైన ఆయుధంతో దాడి చేశాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో మహేశ్‌ను 108 అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసు కెళ్లారు. మహేశ్ కోలుకుంటున్నాడు. మహేశ్ మేనమామ కట్ట కొమురయ్య ఫిర్యాదు మేరకు నిందితుడు కొమురయ్య ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్

కోల్‌సిటీ, మార్చి 30: ఈస్టర్‌ను పురస్కరించుకొని పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం గోదావరిఖనిలో రన్ ఫర్ జీసస్ వేడుక నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ర్యాలీని ప్రారంభించారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తా నుంచి రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయం వరకు ఉత్సాహంగా సాగింది. కార్పొరేటర్లు, పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

కోల్‌సిటీ, మార్చి 30: మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్టు, సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యులు కోరారు. ఈమేరకు శనివారం గోదావరిఖనిలో స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఏప్రిల్ 5న మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రాం, 11న మహాత్మా జ్యోతిరావు పూలే, 14న అంబేద్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణకు పూర్తిగా సహకారం అందించాలని కోరారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు ఘనంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. సంఘం నాయకులు బొంకూరి మధు, పులి మోహన్, మంతెన లింగయ్య, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతల రాజేశ్, పెద్దెల్లి తేజస్వి, బొమ్మక శైలజ, ఇరుగురాల కృష్ణయ్య, బొందయ్య, మహేందర్, నర్సింగరావు, బొంకూరి పవన్ తదితరులున్నారు.

ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు

పెద్దపల్లిరూరల్, మార్చి 30: పెద్దపల్లి మండలంలోని పెద్దబొంకూర్‌లో గల మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం పిల్లలకు భేటీ బచావో, భేటీ పడావో కార్యక్రమంలో బాగంగా శనిదారం డాక్టర్ మధుకర్ ఆద్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళా సాధికారత కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ ఆధ్వర్యంలో పిల్లలకు రక్షణ చట్టాలు, పోక్సో చట్టం,హెల్ప్‌లైన్ నంబర్లు, సఖీ కేంద్రం సేవలు, పోష్ చట్టం, పీసీ, పీఎన్‌డీ చట్టంపై అవగాహన కల్పించారు.ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఎంఎల్ హెచ్‌పీ అభినయ్, హెచ్‌ఈ మధు సూదన్, యూడీసీ ప్రవీణ్, అకౌంట్స్ ఆఫీసర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

నేరస్తులకు శిక్షపడేలా ఇన్వెస్టిగేషన్ చేయాలి

రామగుండం సీపీ ఎం శ్రీనివాసులు

ఫర్టిలైజర్‌సిటీ, మార్చి 30: సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పరిశోధనతో సమగ్ర విచారణతో నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి కన్వెన్షన్ రేట్ పెంచాలని రామగుండం పోలీసు కమిషనర్ ఎం శ్రీనివాస్ అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో కమిషనరేట్ పరిధిలోని డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, స్టేషన్, ఎస్‌హెచ్‌వోలతో సీపీ శనివారం సమీక్ష నిర్వహించారు. యూఐ కేసులు, గ్రేవ్ యూఐ లాంగ్ పెండింగ్ కేసుల పరిష్కారం, ఎస్సీ, ఎస్టీ యూఐ కేసులు, విమెన్ ఎగైనెస్ట్ కేసులు, పీవోసీఎస్ఓ కేసుల పరిష్కారం, ఎన్‌డీపీసెస్ యాక్ట్ కేసులు, ఎన్‌హెచ్‌ఆర్‌సీ, ఎస్‌హెచ్‌ఆర్‌సీ, మహిళా కమిషన్‌కు సంబంధించిన అప్పీల్ పిటిషన్ పెండింగ్‌పై సీపీ సమీక్షించారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసులను త్వరగా డిస్పోజల్ చేయాలని సూచించారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన విచారణతో 60 రోజుల్లో పూర్తి

మాట్లాడుతున్న సీపీ శ్రీనివాసులు

చేసి కోర్టులో చార్జిషీట్ వేయాలని సూచించారు. ప్రతి కేసులో నాణ్యత, విచారణతో పాటు పూర్తి పారదర్శకత పాటించాలన్నారు. బాధితుల ఫిర్యాదులు, ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఫ్రీ అండ్ ఫెయిర్ ఎన్నికలు నిర్వహించడానికి అధికారులందరూ సమష్టిగా విధులు నిర్వహించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల సంఘం సూచనల ప్రకారం బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. సరిహద్దు రాష్ట్రాల పోలీసు అధికారులతో ఎప్పటికప్పుడు సమాచార సేకరణతో అక్రమ రవాణాకు సంబంధించి ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఇక్కడ పెద్దపల్లి, మంచిర్యాల డీసీపీలు చేతన, అశోక్ కుమార్, అడిషనల్ అడ్మిన్ డీసీపీ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని, పెద్దపల్లి, మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి ఏసీపీలు ఎం రమేశ్, జీ కృష్ణ, ఆర్ ప్రకాశ్, వెంకటేశ్వర్లు, రవికుమార్, టాస్క్ ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, సీసీఎస్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, ఏఆర్ఏసీపీ సురేంద్ర, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

జీపీ కార్యాలయం ఎదుట పడేసిన చెత్త

జీపీ ఎదుట చెత్త వేసి నిరసన

జూలపల్లి, మార్చి 30 : గ్రామ పంచాయతీ అధికారులు చెత్త తరలించడం లేదని ఓ వ్యక్తి శనివారం నిరసన వ్యక్తం చేశాడు. పెద్దాపూర్ కార్యదర్శి పున్నమయ్యకు చాలా సార్లు సమాచారం ఇచ్చినా తన ఇంటి వద్ద చెత్త తొలగింపు తరలింపు చేపట్టలేదని ఐదో వార్డుకు చెందిన ఆషాడపు రవీందర్ పేర్కొన్నాడు. కొన్ని రోజుల నుంచి నిల్వ ఉన్న చెత్త తరలించాలని విజ్ఞప్తి చేశాడు. పంచాయతీ కార్యాలయం ముందు చెత్త పడేసి అధికారుల నిర్లక్ష్యాన్ని తూర్పార పట్టాడు. కాగా వాడ వాడలా పారిశుధ్య కార్మికులు చెత్త తొలగిస్తున్నారని, రవీందర్ కావాలనే తమను ఇబ్బందులు పెడుతున్నాడని కార్యదర్శి పేర్కొన్నారు.

మసీదు నిర్మాణానికి విరాళం అందజేత

ధర్మారం,మార్చి30: మండలంలోని కొత్తూరుకు చెందిన ఎన్ఆర్ఐ (కెనడా) కొలుముల దామోదర్ యాదవ్ చామనపల్లి గ్రామంలో మసీదు నిర్మాణానికి రూ. 5వేలు విరాళం అందజేశారు. మసీదు నిర్మాణానికి విరాళం అందించాలని కోరగా, దామోదర్ యాదవ్ స్పందించారు. తన ఫౌండేషన్ ద్వారా రూ.5వేలు పంపించారు. ఆ డబ్బులను నిర్వాహకులకు ఫౌండేషన్ ఇన్‌చార్జి వేల్పుల నాగరాజు శనివారం అందజేశారు.

రోడ్లు విశాలంగా ఉంటేనే వ్యాపారాల అభివృద్ధి

మాట్లాడుతున్న కమిషనర్ శ్రీకాంత్

రామగుండం కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్

కోల్‌సిటీ, మార్చి 30: రోడ్లు విశాలంగా ఉంటేనే వ్యాపారాలు కూడా అభివృద్ధిలోకి వస్తాయని నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ తెలిపారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో శనివారం టౌన్ వెండింగ్ కమిటీ సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. ఈ ప్రాంతం కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయినా ఇంతకాలం రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు సాగించడంతో నగరం అభివృద్ధి చెందలేకపోయిందన్నారు. ఇక నుంచి రోడ్ల ఆక్రమణలను పూర్తిగా తొలగించేది ప్రజలు, వ్యాపారుల కోసమేనని స్పష్టం చేశారు. మేడిపల్లి సెంటర్ గ్రీన్‌బెల్టులో ఆక్రమణలు తొలగిస్తున్నందున చిరు వ్యాపారులు తమ ఉపాధి కోల్పోకుండా ప్రత్యమ్నాయంగా సమీపంలోని ఎన్టీపీసీ వారసంతలో తమ వ్యాపారాలు నిర్వహించుకోవచ్చన్నారు. చిరు వ్యాపారుల సౌకర్యార్థం ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని పార్కింగ్ స్థలాన్ని కూడా వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నగదు రహిత లావాదేవీలను నిర్వహించడానికి శిక్షణ ఇచ్చిన మాదిరిగా సైబర్ క్రైమ్ బారిన పడకుండా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో చిరు వ్యాపారులకు అవగాహన కల్పించాలని గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్ కోరారు. రాజీవ్ రహదారి ప్రమాదరహితంగా తీర్చిదిద్దడానికి, ట్రాఫిక్ స్తంభించి ప్రజలు ఇబ్బందులు పడకుండా రహదారులను రద్దీ రహితంగా మార్చేందుకు అందరూ సహకరించాలని ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్ కోరారు. వీధి వ్యాపారుల కోసం మైక్రో ఫైనాన్స్ సంస్థలు, వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా బ్యాంకుల సహకారంతో నగర పాలక సంస్థ పరిధిలో 14 వేల మంది చిరు వ్యాపారులకు చిన్న మొత్తాలను రుణాలుగా ఇప్పించినట్లు మెప్మా డీఎంసీ రజనీ తెలిపారు. వెండింగ్ జోన్స్ గుర్తించడం, నైట్ షెల్టర్ల నిర్వహణ బాధ్యతలు ఏజెన్సీలకు అప్పగించడం తదితర అంశాలపై చర్చించారు. డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్ రావు, ఐసీడీఎస్ సీడీపీవో స్వరూప, ప్రభుత్వ దవాఖాన ఆర్ఎంవో అప్పారావు, సూపరింటెండెంట్ మనోహర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, బ్యాంకు అధికారులు, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

బొగ్గు రవాణాపై దృష్టి సారించాలి

- సింగరేణి సీఎండీ ఎన్ బలరాం
- ఓసీపీ-1 సీహెచ్‌పీ పరిశీలన

యైటింక్లయిన్ కాలనీ, మార్చి 30 : రామగుండం రీజియన్ పరిధిలోని ఆర్జీ-3 ఏరియాలో శనివారం సీఎండీ ఎన్ బలరాం పర్యటించారు. ఓసీపీ-1 సీహెచ్‌పీ బంకర్‌ను పరిశీలించారు. బొగ్గు ఆధారిత పరిశ్రమలకు సకాలంలో బొగ్గు రవాణా చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బొగ్గు రవాణాలో సీహెచ్‌పీల పాత్ర ఘననీయమైందని గుర్తు చేశారు. ఇందుకు అనుగుణంగా బంకర్లు, బెల్ట్‌లను ఎప్పటికప్పుడు మరమ్మతు చేపట్టి ఆధునీకరించాలని సూచించారు. బొగ్గు రవాణాకు ఏ మాత్రం విఘాతం కలిగినా వినియోగదారులు ఇబ్బందిపడుతారని పేర్కొన్నారు. బొగ్గు రవాణాకు అనుగుణంగా డివిజన్‌లో ఉత్పత్తి పెంచాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత లక్ష్యాలను ముందస్తుగా సాధించడంపై ఉద్యోగులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో సమష్టిగా ముందుకు సాగాలన్నారు. ఆయన వెంట ఏరియా జీఎం ఎన్. సుధాకర్‌రావు, ఇంజనీర్ ఏలీషా, ప్రాజెక్టు అధికారి ఎన్. రాధాకృష్ణ, సేఫ్టి అధికారి వెంకటరమణ, సీహెచ్‌పీ డీజీఎం కాశీవిశ్వేశ్వరరావు, నాణ్యతాధికారి బీవీ సత్యనారాయణ, మేనేజర్ ఉదయ్‌హరిజన్‌లు ఉన్నారు.

జీడీకే-1,3 గనిలో సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ త్రైమాసిక సమావేశం

గోదావరిఖని, మార్చి 30: సింగరేణి ఆర్జీ-1 జీడీకే-1,3 గనిలో సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ త్రైమాసిక సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్పొరేట్ జీఎం గురువయ్య, ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ హాజరై ప్రారంభించారు. సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ వర్షన్ 3.0 తయారీకి సేఫ్టీ ప్లాన్ వర్షన్ 2.0లో సవరణలు, నవీకరణలు, చేర్పులు, తొలగింపుల కోసం సమీక్షించారు. ప్లాన్ తయారీకి గైడ్‌లైన్లు, నియంత్రణ విధానాలను అమలు చేయడం, రోడ్డు భద్రత హెల్మెట్లు, ఏబీసీడీ సిస్టమ్ గురించి చర్చించారు. ఉద్యోగులలో భద్రతా సంస్కృతిని పెంపొందించడానికి మంచి పరిశ్రమ పద్ధతులు, సాధారణ ఆరోగ్యం, భద్రత, సంక్షేమం, రహదారి భద్రత, ప్రమాద గణంకాలు, ప్రాణాంతకమైన సహజ మరణాలు, సాధారణ మరణాలుపై చర్చించారు. శూన్య హానీ, పిట్ మ్యాగజైన్, సర్ఫేస్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. సమావేశంలో ఏజెంట్ సైదులు, ఇంజనీరు రామ్మూర్తి, ఓదెలు, ఇంజినీర్, రమేశ్ బాబు, శ్రీనివాస రావు ఉన్నారు.

ఐటీ పన్నుతో సింగరేణి కార్మికుల నడ్డి విరుస్తున్న బీజేపీ

గోదావరిఖని, మార్చి 30: ప్రకృతికి విరుద్ధంగా పని చేస్తూ దేశానికి నల్లబంగారం వెలికితీస్తున్న సింగరేణి కార్మికులను ఐటీ పన్ను పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నడ్డివిరుస్తున్నదని ఎస్సీ,ఎస్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీపీ ఆనంద్ రావు ఆరోపించారు. సింగరేణి కార్మికులు నెలంతా కష్టపడితే వచ్చే ఆదాయం నుంచి సగం డబ్బులు ఐటీ పేరుతో కోత విధించడం అన్యాయమని పేర్కొన్నారు. ఐటీ భారంతో సింగరేణి కార్మికుల జీవితాలు కూడా అంతంత మాత్రంగానే మారుతున్నాయనీ, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మికులకు ఐటీ స్లాబ్ పెంచలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేసి సింగరేణి కార్మికులకు ఐటీ మినహాయింపు ఇవ్వాలని కేంద్రంకు తీర్మానాలు పంపించినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని ఆరోపించారు. వివిధ ట్రేడ్ యూనియన్‌ల నాయకులు కూడా కార్మికులను ప్రతి ఎన్నికల్లో ఐటీ మినహాయింపు చేయిస్తామని వాగ్దానాలు చేసి తర్వాత కార్మికులను మరిచిపోతున్నారని పేర్కొన్నారు. గత పదేళ్లుగా సింగరేణి కార్మికులను ఐటీ పన్నుతో నడ్డివిరుస్తున్న బీజేపీ ప్రభుత్వంకు త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో సింగరేణి కార్మికులు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం

గోదావరిఖని, మార్చి 30: సింగరేణి ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో సివిల్ క్వాలిటీలో పని చేసి పదవీ విరమణ పొందుతున్న జేఆర్ ఇంజనీరు పొట్టూరి శ్రీనివాస రావుకు శనివారం వీడ్కోలు పలికారు. ఈమేరకు ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ హాజరై శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. జీఎం మాట్లాడుతూ క్రమశిక్షణతో, స్నేహపూర్వకంగా మెదిలి అందరి మన్ననలు పొందారని, పదవీ విరమణ అనేది అనివార్యమని ప్రతి ఒక్కరూ పదవి విరమణ పొందుతారని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం రామ్మోహన్, ఏజీఎం లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, ఏఐటీయూసీ ప్రతినిధి పద్మ, సీఎంఓఏఐ ప్రధాన కార్యదర్శి కోలా మల్లేశ్, పీఓ హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

2న మండల సర్వసభ్యసమావేశం

పెద్దపల్లిరూరల్, మార్చి 30: పెద్దపల్లి మండల సర్వసభ్యసమావేశం ఏప్రిల్ 2న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు హాజరవుతారని పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో రావాలని, సభ్యులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

సుల్తానాబాద్ రూరల్,మార్చి30: గర్రెపల్లి ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు, వివిధ కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ఎంపీడీవో దివ్యా దర్శన్‌రావు, ఎంఈవో సురేంద్రకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

వడ్డీ రాయితీని వినియోగించుకోవాలి

కమిషనర్‌కు చెక్కు అందజేస్తున్న బీఎస్ఎన్ఎల్ అధికారి

పెద్దపల్లి, మార్చి30: పట్టణ ప్రజలు సకాలంలో ఇంటి పన్నులు, నల్లా బిల్లులు ట్రేడ్ లైసెన్సులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ ఆకుల వెంకటేష్ కోరారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయ బకాయి రూ. 6,70138లకు సంబంధిచిన చెక్కును బీఎస్ఎన్ఎల్ అధికారి శనివారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా ఒక్కరోజు మాత్రమే మిగిలి ఉందని, ఇంటి పన్ను బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ పై 90 శాతం రాయితీ ఇచ్చినందున పట్టణ ప్రజలు నేటి రాత్రి వరకు చెల్లించవచ్చాని సూచించారు. ఈఅవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శివ ప్రసాద్, బిల్ కలెక్టర్ అజయ్ పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో ప్రతిభ చూపిన బాలికలతో అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ

ప్రతిభ చూపిన బాలికలకు ప్రోత్సాహకాలు

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ

పెద్దపల్లి, మార్చి30: క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన బాలికలను ప్రోత్సహించేందుకు నగదు బహుమతులు అందించామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ తెలిపారు. క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. భేటి బచావో, భేటి పడావో కార్యక్రమంలో భాగంగా మండలాల వారీగా జిల్లా విద్యా శాఖ అధికారి నేతృత్వంలో క్రీడాపోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతిభ చూపిన 14 మంది బాలికలను ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ. 3,300చొప్పున చెక్కులు అందించామని వివరించారు. జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి ఏ సురేశ్, పీఈటీలు, ఉపాధ్యాయులు,అధికారులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు వీడ్కోలు

ఫర్టిలైజర్‌సిటీ, మార్చి 30: పోలీసు శాఖలో వివిధ హోదాల్లో సుదీర్ఘ కాలంగా పని చేసి ఉద్యోగ రమణ పొందుతున్న పలువురు పోలీసు అధికారులను రామగుండం సీపీ ఎం శ్రీనివాస్ కమిష నరేట్‌లో శనివారం సన్మానించారు. పీసీఆర్ ఏఎస్ఐ వెంకటేశ్వర్‌రావు, రామగుండం పోలీస్టేషన్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ పీ అంజయ్య, హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ సత్తయ్య, బసంత్‌నగర్ హెడ్ కానిస్టేబుల్ ఎండీ అజిజ్‌బేగ్‌లను సీపీ సన్మానించి మాట్లాడారు. పెద్దపల్లి డీసీపీ చేతన, అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, ఏవో సతీశ్, రామగుండం పోలీసు కమిషనరేట్ పోలీసు సంఘం అధ్యక్షుడు బోర్లకుంట పోచలింగం, స్వామి, పదవీరమణ ఉద్యోగ కుటుంబ సభ్యులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★Experienced Supervisors Needed.
1 year of Waterproofing Experience Required. Contact: Jaya Bharathi Constructions at 8790508663.
NT-10287-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

వివేక్ కుటుంబాన్ని తరిమికొట్టండి

- బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్

పెద్దపల్లి టౌన్, మార్చి 30: తరచూ పార్టీలు మారుతూ ప్రజలను మోసం చేసిన గడ్డం వివేక్ వెంకటస్వామి కుమారుడు వంశీ కృష్ణను రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తరిమికొట్టాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పెద్దపల్లిలోని శివాలయం వీధి నుంచి శనివారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అనంతరం బీజేపీ పార్లమెంట్ స్థాయి సన్నాహాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోమాస శ్రీనివాస్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నుంచి అనేక సార్లు గెలిచిన గడ్డం వెంకటస్వామి కుటుంబం పెద్దపల్లి అభివృద్ధికి ఏనాడూ కృషి చేయలేదన్నారు. తన వ్యక్తిగత వ్యాపార సామ్రాజ్యం నిర్మించుకున్నాడే తప్ప నిరుద్యోగులు, పేదలను ఏనాడూ కన్నెత్తి చూడలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ టికెట్ ఇచ్చి ప్రజల్లో అభాసుపాలైందని విమర్శించారు. ఇక్కడ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొరహక్కుల దినోత్సవం

కాల్వశ్రీరాంపూర్, మార్చి30: వెన్నంపల్లి లో శనివారం పొరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జాహెద్‌పాషా మాట్లాడారు. అందరూ కలిసిమెలిసి ఉండాలని, కుల వివక్ష చూపితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహనాచారి, ఏవో నాగర్జున, గిర్దావర్ ఉదయశ్రీ, కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, గ్రామస్తులు, దళిత సంఘాల నాయకులు ఉన్నారు.

లింగాలలో..

కమాన్‌పూర్, మార్చి 30: నాగారం పంచాయతీ పరిధిలోని లింగాలలో పొర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆలయాల ప్రవేశం, రెండు గ్లాసుల పద్ధతిపై అధికారులు అడిగి తెలుసుకున్నారు. కమాన్‌పూర్ తహసీల్దార్ ఎండీ ఆరీఫొద్దీన్, ఎస్సై-2 జక్కు రవళి, ఏఎస్ఐ బాలాజీ, హాస్టల్ వార్డెన్ వెంకటస్వామి, మానవ వికాస వేదిక రాష్ట్ర కళా మండలి అధ్యక్షుడు దాసరి రామస్వామి, పొడగంటి రవి, అంబటి కనకయ్య పాల్గొన్నారు.

సాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

ఓదెల, మార్చి30: కాల్వల ద్వారా వచ్చే సాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని డీఏవో ఆదిరెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని పిట్టల ఎల్లయ్యపల్లె, కనగర్తి గ్రామాల్లోని వరి పంటలను డీఏవో శనివారం పరిశీలించారు. కాల్వల నీటిని సద్వినియోగం చేసుకొని, తోటి రైతుల సహకారంతో పంటలు కాపాడుకోవాలని వివరించారు. ఇక్కడ ఏవో నాగార్జున, ఏఈవో సతీశ్, రైతులు ఉన్నారు.

ఇనుము దొంగల పట్టివేత

ముత్తారం, మార్చి 30: మండలంలోని ఓడేడు మానేరు వాగుపై నిర్మించనున్న బ్రిడ్జి సంబంధించిన ఇనుప రాడ్లను మంథని మున్సిపల్‌కి చెందిన ముగ్గురు మహిళలు దొంగలించి ఎత్తుకెళ్తుండగా వారిని ఓడేడు గ్రామస్తులు బస్తాండ్ ఆవరణలో పట్టుకున్నారు. మహిళల వద్ద సుమారు 50 కిలోల నుంచి 80 కిలోల ఇనుప రాడ్లు దొరికాయి. చోరీ చేసిన సామగ్రిని తిరిగి బ్రిడ్జి వద్ద మహిళలతో వేయించారు. ఇదే ముగ్గురు చాలాసార్లు ఇనుప రాడ్లను అక్రమంగా దొంగలించారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇంకోసారి ఇలాంటి పనులు చేస్తే పోలీసులకు సమాచారం ఇస్తామని గ్రామస్తులు హెచ్చరించి వదిలేశారు.

ఆమె నేత్రాలు సజీవం

బర్ల రాజక్క (ఫైల్)

ముత్తారం, మార్చి 30: మండలంలోని లక్కారం గ్రామానికి చెందిన బర్ల రాజక్క (70) శనివారం అనారోగ్యంతో మృతి చెందగా, కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను దానం చ